# ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి



రమాబాయి చిత్రపటానికి నివాళి ఘటిస్తున్న మహిళలు

కొడంగల్, ఫిబ్రవరి 7: రమాబాయి అంబేద్కర్ 127వ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి మహిళలు ఘనంగా నివాళి అర్పించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో రమాబాయి జయంతిని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘాల అధ్యక్షుడు రమేశ్‌బాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి రమాబాయి ఎన్నో త్యాగాలను చేసిందని, ఆమె సేవలను కొనియాడారు. ఆమె త్యాగనిరతికి కృతజ్ఞతగా ప్రతి ఇంట్లో ఆమె చిత్రపటాన్ని ఉంచుకోవాలని కోరారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని అమె అడుగుజాడల్లో నడిచి ఆమె ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి. వెంకటయ్య, మల్లమ్మ, కృష్ణవేణి, సరస్వతి, శోభ, శిరీషా, అంజమ్మ, వెంకటమ్మ, నర సమ్మ, లక్ష్మి, ఆశమ్మ, కిష్టమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ■ మందకృష్ణకు సన్మానం..



పరిగి, ఫిబ్రవరి 7 : ఎస్సీల వర్గీకరణ నేపథ్యంలో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందుకృష్ణ మాదిగను పరిగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. మందకృష్ణను సన్మా నించిన వారిలో బహుజన నాయకులు లఖ్నాపూర్ శ్రీనివాస్, వినోద్, గట్టుపల్లి నర్సింహులు ఉన్నారు.

## ■ సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



తాండూరు రూరల్, ఫిబ్రవరి 7 : తాండూరు మండలం, గౌతాపూర్‌లో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో ఇప్పటి వరకు రూ.35 లక్షల విలువైన అభివృద్ధి పనులు మంజూరైనట్లు మాజీ ఎంపీటీసీ జన్నె నాగప్ప తెలిపారు. గతంలో రూ.20 లక్షలతో పలు వార్డుల్లో సీసీ రోడ్ల పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం రూ.15 లక్షతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయని, అనుబంధ గ్రామమైన గోపన్‌పల్లిలో రూ.5 లక్షలు వ్యయం చేసి రోడ్డు వేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, మల్‌రెడ్డి పలువురు నాయకులు ఉన్నారు.

# పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



బషీరాబాద్, ఫిబ్రవరి 7 : ఎక్మాయి గ్రామంలోని పాఠశాలలో వసతులు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ముందు ఆందోళన దిగారు. 'అమ్మ ఆదర్శ' పాఠశాల కింద రూ. ఆరులక్షల నిధులను మంజూరు అయ్యాయని వారు తెలిపారు. వాటితో పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామ కమిటీలోని కొంత మందికి అప్పగించారన్నారు. పనులు చేపట్టిన సదరు వ్యక్తులు అసంపూర్తిగా చేసి వదిలేశారని అగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు అనారోగ్యానికి గురి అవుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు.



కులకచర్ల, ఫిబ్రవరి 7 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలను అలవర్చుకోవాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి 64వ వార్షికోత్సవం సందర్భంగా ఆంజనేయస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అనంతయ్య, చంద్ర భూపాల్‌రావు, కృష్ణయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మత్స్యకారుల భవనం ప్రారంభం



దోమ, ఫిబ్రవరి 7: మండల పరిధిలోని గుండాల గ్రామంలో రూ. 12.25లక్షల నిధులతో నూతన మత్స్యకారుల భవనాన్ని పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, దోమ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, గుండాల్ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు డోకూరి అంజిలయ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటి డైరెక్టర్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి, మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాఘువేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతి రెడ్డి, యాద య్యసాగర్, శేఖర్, గుండాల మత్స్యసహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కరెంట్ కోతలు షురూ..

తాండూరు రూరల్, ఫిబ్రవరి 7: ఎండలు ముదరకముందే కరెంట్ కోతలు ప్రారంభమయ్యాయి. తాండూరు మండలంలోని గౌతాపూర్, కోటబాసుపల్లి, కరణ్‌కోట సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంట్ ఎప్పుడు వస్తోందో, ఎప్పుడూ పోతుందో తెలియని అయోమయ పరిస్థితి. గౌతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు వెయ్యికి పైగా నాపరాతి పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో నాపరాయి పాలిష్ చేసేందుకు 1,500 మంది వరకు కార్మికులు డే, నైట్ పని చేస్తారు. అదేవిధంగా కరణ్‌కోట, కోటబాసుపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో నాపరాతి గనులు విస్తరించి ఉన్నాయి. ఆయా గనుల్లో వలస కార్మికులు, స్థానిక కార్మికులు నాపరాయిని వెలికి తీస్తారు. కరెంట్ కోతల కారణంగా నాపరాయి పరిశ్రమలో పని చేసే కార్మికులకు, గనుల్లో పనుల చేసే కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కరెంట్ పైనే వారి జీవనం ఆధారపడి ఉంది. కష్టపడి పని చేస్తే డబ్బులు వస్తాయి, అదే కరెంట్ కట్ అయితే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని కార్మి కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశ్రమల్లో పనులు చేసేందుకు కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కార్మికులు వస్తారు. కేవలం వారి జీవనాధారం రోజు కూలీ పైనే ఆధారపడి ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రెప్పపాటు కరెంట్ పోయేది కాదని పలువురు కార్మికులు అంటున్నారు. ఇదిలావుంటే కర్షకుల పరిస్థితి కూడా ఆగమ్య గోచరంగా మారింది. వ్యవసాయ పంపు సెట్ల వద్ద రైతులు కరెంట్ కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధానంగా మిట్టబాసుపల్లి, గుంతబాసుపల్లి, కోటబాసుపల్లి, జినుగుర్తి గ్రామాల రైతులు వేసవిలో ఉల్లిపంట సాగు చేస్తారు. కేవలం బోర్ల కింద ఈ పంట సాగు చేస్తారు. పంటకు నీరు అందించాలంటే రాత్రి, పగలు అక్కడే ఉండాల్సిన పరిస్థితులు దాపురించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కర్షకులు, కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితులు దాపురించాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం కరెంట్ కోతలు లేవు, కేవలం అంతారాయం మాత్రం ఉందంటూ దాట వేసే ధోరణితో ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కష్టాలను తొలగించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కులకచర్ల, ఫిబ్రవరి 7 : నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కులకచర్ల తహసీల్దార్ మురళీధర్ హెచ్చరించారు. శుక్రవారం కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన 8 మంది గత ఎన్నికల ముందు బెల్టుషాపులు, సార విక్రయిస్తూ పట్టుబడిన వారిని ఎక్సైజ్ శాఖ ఎస్ఐ దయాసాగర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా మద్యం అమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. విరుద్ధంగా మద్యం విక్రయిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బెల్టుషాపుల నిర్వాహకులలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీధర్

## ఆర్మీ అధికారి అంటూ సైబర్ మోసం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ):తన ఫ్లాట్‌ను ఆన్‌లైన్ ద్వారా అమ్మకానికి పెట్టిన ఓ వ్యక్తికి ఆర్మీ అధికారిని అంటూ ఫోన్ చేసి బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్ కాలనీలోని జ్యోతి ప్రహ్లద్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అభిషేక్ గడే అనే యువకుడు ఓ ప్రైవేట్ సంస్థలో మార్కెటింగ్ హెడ్ గా పని చేస్తున్నారు. ఇటీవల తన ఫ్లాట్‌ను అమ్మేందుకు మ్యాజిక్ బ్రిక్స్, 99 ఎకర్స్ అనే సైట్లలో ప్రకటన ఇచ్చారు. రెండు రోజుల క్రితం అశోక్ కుమార్ అనే వ్యక్తి అభిషేక్‌కు ఫోన్ చేసి తాను ఆర్మీ అధికారిని అంటూ పరిచయం చేసుకున్నాడు. ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని.. దీనికోసం ముందుగా ఆర్మీ మర్చంట్ అకౌంట్ లో ట్రాన్సాక్షన్ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పాడు. ఆర్మీ మర్చంట్ అకౌంట్ కు రూ.1 ముందు పంపాలని చెప్పాడు. అకౌంట్లోకి రూ .1 వచ్చిన తర్వాత వెనక్కిపంపించాడు. ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేస్తున్నట్టు నమ్మించి రెండు దఫాలుగా మొత్తం రూ.98 వేలను బాధితుడి అకౌంట్ నుంచి కాజేశారు. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన బాధితుడు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమతిలేని ప్రకటనల యూనిపోల్స్ తొలగింపు

హైడ్రా కమిషనర్ రంగనాథ్



శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 : నగరంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రకటనల యూనిపోల్స్‌ను శుక్రవారం తొలగించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపులా అనుమతులు తీసుకోకుండా భారీ హోర్డింగులు ఏర్పాటు చేసి.. ప్రభుత్వానికి రుసుములు చెల్లించని వాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. శంసాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంలో ప్రటనల హోర్డింగులను ముందుగా తొలగిస్తున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు తొలగిస్తున్నట్లు తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తొలగిస్తున్న హోర్డింగులను పరిశీలించినట్లు తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 140 హోర్డింగులు ఉండగా.. 130 వాటికి అనుమతి ఉంది. మిగతా 10 హోర్డిం గులకు ఎలాంటి అనుమతి లేదని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు వాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు మీడియాకు వివరించారు. హోర్డింగ్‌ల ద్వారా ఏడాదికి దాదాపు కోటి రూపాయల పైగా ఆదాయం వస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు తెలిపారు. వాటిని 2023 నుంచి రుసుము తీసుకోవడంలేదని చెప్పారు.

## ఆస్తి పంపకాల్లో గొడవ ..అన్నపై దాడి

బంజారాహిల్స్ : ఆస్తి పంపకాల్లో చోటుచేసుకున్న వివాదం గొడవగా మారి అన్నపై హత్యాయత్నానికి దారితీసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న వివరాలు ఇలా ఉన్నాయి. యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్‌నగర్‌లో నివాసం ఉంటున్న పానేటి శ్రీనివాస్‌కు, అతడి సోదరుడు యాదగిరి మధ్య కొన్ని రోజులుగా ఆస్తిపంపకాలకు సంబంధించిన గొడవలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో అన్నదమ్ముల మధ్య పంపకాల గురించి చర్చలు నడుస్తున్నాయి. మధ్యవర్తిగా యాదగిరి స్నేహితుడు మహేశ్ కూడా ఉన్నాడు. పంపకాల గురించి ఇరువర్గాల మధ్య మాటా మాట పెరగడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన యాదగిరి, మహేశ్‌లు శ్రీనివాస్ మీద దాడి చేశారు.
ఈ గొడవలో యాదగిరి సెంట్రింగ్ కర్ర తీసుకొని శ్రీనివాస్ తలపై కొట్టడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు . శ్రీనివాస్ భార్య ఫిర్యా దు మేర కు నిందుతలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అక్రమ డంపింగ్‌పై హైడ్రా ఫిర్యాదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7: చెరువుకు సంబంధించిన స్థలంలో అక్రమంగా లారీలతో మట్టిని తీసుకువచ్చి డంపింగ్‌చేస్తున్న వ్యక్తులపై హైడ్రా అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్ సైట్ -2 లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 87 కింది భాగంలో ఉన్న రాక్ గార్డెన్ పార్కు, దాని పక్కనే ఉన్న చెరువుకు చెందిన స్థలంలో గత కొంతకాలంగా గుర్తు తెలియని వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలను, మట్టిని డంపింగ్ చేస్తున్నారు. ఈ విషయంపై స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారి బి సుజిత్ పరిశీలన నిర్వహించారు. ఆ సమయంలో ఓ వాహనంలో నిర్మాణ వ్యర్థాలను తీసుకువచ్చి రాక్ గార్డెన్ స్థలంలో డంపింగ్ చేస్తున్న విషయాన్ని హైడ్రా అధికారులు గుర్తించారు. దీంతో డంపింగ్ కోసం వినియోగిస్తున్న వాహనం డ్రైవర్ అంజి, డంపింగ్ చేస్తున్న వెంకటేశ్, జాకీర్ అనే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ హైడ్రా అధికారి సుజిత్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విజేతలకు అభినందనలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో హైదరాబాద్ సిటీ పోలీసులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన పోలీసుక్రీడాకారులను శుక్రవారం సీపీ అభినందించారు. ఈ పోటీల్లో 236 మంది పోలీసు సిబ్బంది 26 విభాగాల్లో పోటీ పడి 9 ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్స్‌తో పాటు 67 బంగారు, 32 రజత, 23 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఒకవైపు పోలీసుగా తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూనే మరోవైపు క్రీడల్లో రాణించడానికి అవసరమైన అంకిత భావం, కఠినమైన శిక్షణతో సిటీ పోలీసులు విజేతలుగా నిలిచారని సీవీ ఆనంద్ అన్నారు. రాబోయే ఆల్‌ఇండియా స్పోర్ట్స్ మీట్‌లో రాణించేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి పూర్తి పరిపాలనా సహకారాన్ని అందిస్తానని చెప్పారు.

# ఒడిశా కేంద్రంగా గంజాయి రవాణా..

### లేడీ డాన్ సహా మరో ఇద్దరు అరెస్ట్.. 14.5కిలోలు స్వాధీనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ఒడిశా కేంద్రంగా నగరానికి గంజాయి తరలిస్తున్న ఒక లేడీ డాన్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులను ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి వద్ద నుంచి రూ.3.5లక్షల విలువ చేసే 14.50కిలోల గంజాయి, రూ.5లక్షల విలువ చేసే కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆబ్కారీ పోలీసుల కథనం ప్రకారం.. సునీతాదాస్ గంజాయి సరఫరా చేస్తుంది. ఒడిశాలోని మల్కాన్‌గిరి జగ్గల్‌దేవ్‌పూర్ నుంచి తక్కువ ధరలో గంజాయి కొనుగోలు చేసి నగరంలోని ధూల్‌పేట, ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం ఒడిశా నుంచి కారులో గంజాయిని ధూల్‌పేటకు రవాణా చేస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు, హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులతో కలిసి హయత్‌నగర్‌లో పట్టుకున్నారు. అయితే ఎవరికీ అనుమానం రాకుండా సునీతాదాస్ కారు డిక్కీలో ప్రత్యేకంగా రూపొందించిన అరలో గంజాయిని పెట్టి రవాణా చేస్తున్నట్లు ఆబ్కారీ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు సునీతాదాస్‌తో పాటు కారు డ్రైవర్ ఇస్తియా ఖురేషీ, కంకన్‌సనలను అరెస్టు చేశారు. గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం కేసును హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

**చాంద్రాయణగుట్ట:** గంజాయిని తరలిస్తున్న అంతర్ రాష్ట్ర విక్రేతను చాంద్రాయణ గుట్ట పోలీసులు, దక్షిణ, తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతడి వద్ద నుంచి రూ.50 లక్షల విలువ చేసే గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దక్షిణ, తూర్పు మండలం డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, అడిషినల్ డిప్యూటీ కమిషనర్ స్వామి, చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్‌కుమార్ ,ఇన్‌స్పెక్టర్లు శ్రీరాంసైదాబాబు, గురునాథ్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా ఎర్కపల్లి గ్రామం మెగ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ శివరాం(34), సహచరుడు బనావత్ జైపాల్‌తో కలిసి 2015 నుంచి గంజాయిని అమ్ముతున్నాడు. శివరాం.. గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు, వైజాగ్,అదే విధంగా ఒడిశా, మహారాష్ట్రల నుంచి తెచ్చి తెలంగాణలో అమ్ముతున్నాడు. ఇందులో భాగంగా గురువారం రాత్రి కారులో గంజాయి తీసుకొని శంషాబాద్ నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్తుండగా చాంద్రాయణ గుట్ట ఫ్లైఓవర్ వద్ద పోలీసులు తనిఖీల్లో పట్టుబడ్డాడు. అందులో ఉన్న 200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ సమానమే




బేటీ బచావో, బేటీ పడావో సదస్సులో పాల్గొన్న మహిళా సాధికారత బృందం సభ్యురాలు వరలక్ష్మి, మహిళలు

పరిగి, ఫిబ్రవరి 7 : తల్లిదండ్రులు వివక్ష చూపకుండా అమ్మాయి, అబ్బాయినీ ఇద్దరినీ సమానంగా చూడాలని మహిళా సాధికారత బృందం సభ్యురాలు, జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పరిగిలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మహిళా చట్టాలు, పిల్లల చట్టాలపై అవగాహన కల్పించారు. అమ్మాయిలు అన్ని రంగాలలో ముందుండాలని పేర్కొన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ రాందాస్ మాట్లాడుతూ మహిళలు సమాజంలో జరుగుతున్న వివిధ రకాల ఆర్థిక పరమైన ఇబ్బందులు ముందే గుర్తించి సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత బృందం, మహిళలు పాల్గొన్నారు.

## ■ ఘనంగా అక్షరాభ్యాసం..



కులకచర్ల, ఫిబ్రవరి 7 : మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి శైలజ, సూపర్ వైజర్ యాదమ్మ, ఉపాధ్యాయులు రజిత, లలిత, కవిత, ఆశాకార్యకర్త బాలమణి, పాఠశాల కమిటీ చైర్మన్ కిష్టమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పింఛన్ డబ్బులు ఇవ్వలేదని నానమ్మపై దాడి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 7: పింఛన్ డబ్బులు ఇవ్వలేదనే కోపంతో నానమ్మపై మనుమడు దాడి చేసిన ఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు మండలం, చెంగోల్ గ్రామానికి చెందిన మణెమ్మను ఆరు నెలలుగా పింఛన్ డబ్బులు ఇవ్వాలని నరేశ్ వేధింపులకు గురి చేసేవాడు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో డబ్బులు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు ఇవ్వనని చెప్పడంతో ఇంట్లో ఉన్న ఇనుప రాడుతో తలపై బలంగా కొట్టగా, తీవ్రగాయాలపాలై రక్తం మడుగులో కిందపడిపోయింది. చుట్టు పక్కల వారు నరేశ్‌ను పట్టుకొనేందుకు యత్నించారు. నరేశ్ అక్కడి నుంచి పరారీ అయ్యాడు. గాయాలపాలైన మాణెమ్మను చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

నవాబుపేట, ఫిబ్రవరి 7: ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి కండ్లకు జెండుబామ్ పూసి ఆమె మెడలోనుంచి బంగారాన్ని అపహరించిన ఘటన మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన కుంటి సునీతా, కుంటి వెంకటేశ్‌లు కలిసి వృద్ధురాలి కోడలు బయటకు వెళ్లిన విషయాన్ని గమనించి ఆమె కండ్లకు జెండుబామ్ రుద్ది బంగారం దొంగిలించారు. దొంగిలించిన బంగారాన్ని శంకర్‌పల్లిలో అమ్ముకుని వచ్చిన డబ్బులతో ఒక మొబైలు ఫోన్, ఇంటి అవసరాల నిమిత్తం సామాన్లు తెచ్చుకొవడంతోపాటు మిగిలిన డబ్బుతో తాగి జల్సాలు చేశారు. మరో దొంగతనం కోసం మాదిరెడ్డిపల్లి గేట్ సమీపంలో ప్రయత్నిస్తుండగా దారిన పోయే పోలీసులకు అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తమ తప్పును ఒపుకున్నారు. తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్ పోలీసులకు అప్పగించి వృద్ధురాలి వద్ద బంగారాన్ని తామే దొంగిలించామని ఒప్పుకోగా పోలీసులు దంపతులిద్దరిని రిమాండ్‌కు పంపించారు.

## నేటి నుంచి శ్రీమల్లికార్జున స్వామి జాతర

తాండూరు రూరల్, ఫిబ్రవరి 7: తాండూరు మండలం, బిజ్వార్ గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి ఉత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు జరుగనున్నాయని ఆలయ నిర్వాహకులు కుర్వ కిష్టప్ప తెలిపారు. జాతర ఉత్సవాలు మూడు రోజుల పాటు సాగుతాయన్నారు. జాతరకు తాండూరు, యాలాల, పెద్దేముల్ మండలాలతోపాటు పలు గ్రామాల నుంచి భక్తులు విచ్చేస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.



### రోడ్డు ప్రమాదంలో జింకకు గాయాలు

నవాబుపేట, ఫిబ్రవరి7: మండల పరిధిలోని ఏక్‌మామిడి గ్రామ సమీపంలో రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక గాయాలపాలు కాగా అటుపోయో వాహనదారులు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో జింకను చికిత్స కోసం సంబంధిత అధికారులు అక్కడి నుంచి తీసుకెళ్లారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962